క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): అన్ని గ్రామాల్లో వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, మండల సీనియర్ నాయకులు ఆరే గంగాధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు లేక కోసిన పంట కల్లాల్లోనే ఉంటుందని, రైతులు కుప్పల వద్దే కావలి ఉంటున్నారని తెలిపారు. కొంతమంది రైతులు దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



పెర్కిట్: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగా దినేష్ సూచించారు. ఆర్మూర్ మండలం పిప్రీ గ్రామంలో పిప్రీ ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జ్వర సర్వే నిర్వహించారు. సర్వేను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి దోమల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు సంతోష్, తిరుమల, సుజాత,నరేందర్, రఫీక్,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

అభ్యంతరాల స్వీకరణ

పెర్కిట్: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన పార్టీ నాయకులు తమ అభ్యంతరాలను, సలహాలను అందించాలని ఎంపీడీవో సాయిరాం ఒక ప్రకటనలో అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అభ్యంతరాలను తెలపాలన్నారు. అలాగే రాతపూర్వకంగా, రిజిస్టర్ పోస్టు ద్వారా కమిషన్ కార్యాలయంకు నవంబర్ 13వ చేరుకునేవిధంగా పంపించాలని అన్నారు.

ఓటరు నమోదు పత్రాల అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు పత్రాలను తహసీల్దార్ గజానన్‌కు అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కన్వీనర్ జెస్సు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు నవంబర్ 6వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తిగలవారు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నాయకులు మిరియాల్కర్ కిరణ్ కుమార్, పులి యుగంధర్, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, పీర్‌సింగ్ నాయక్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన పోరాడుతాం



ఆర్మూర్‌టౌన్: కార్మికుల పక్షాన పోరాడుతూ వారి శ్రేయస్సు కోసం యూనియన్ కృషిచేస్తోందని టీఎస్‌ఈఈయూ 327 యూనియన్ నాయకులు అన్నారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద శనివారం యూనియన్ ఆవిర్భవించి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యూనియన్ పతకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు యూనియన్ ముందుటుందన్నారు. డివిజన్ కార్యదర్శి చందర్‌నాయక్, నాయకులు చందర్ నాయక్, కార్మికులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



రుద్రూర్: పశువులకు ఉచితంగా ఇచ్చే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని కోటగిరి ఉమ్మడి మండల పశు వైద్యాధికారి సురేష్ కుమార్ సూచించారు. కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు పెంపకందారులకు సూచనలు చేశారు. వెటర్నరి అసిస్టెంట్ సుధీర్‌గౌడ్, వీఎల్‌వో మంజుల, గోపాల మిత్ర రాము, నగేష్, సాయిలు పశుపెంపకందారులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- బాల్కొండ మండలంలో దుస్థితి
- పట్టించుకోని అధికారులు



నిప్పు పెట్టడంతో కాలిపోయిన వృక్షాలు



నాగంపేట్‌లో రోడ్డు పక్కన నరికి వేసిన చెట్లు

బాల్కొండ: మండలంలో గతంలో హరితహారంలో బాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లు అయ్యాయి. కానీ ఆ చెట్లను రోడ్డు పక్కన పంట భూములు ఉన్న రైతులు యథేచ్ఛగా నరికి వేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చెట్లను నరికితే జరిమానా విధించాల్సిన అధికారులు కరెంట్ వాళ్లు నరికివేశారంటూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని పెద్దవాగు రోడ్డు వెంబడి అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా హరితహారం కింద మొక్కలను నాటారు. అవి చెట్లుగా మారడంతో పంట భూముల్లో పంటలకు నీడ వస్తుందని రైతులు చెట్లను మొదటికి నరికి వేస్తున్నారు. నీడ వస్తే కొమ్మలు నరికివేయాలి కాని, చెట్లను మొదటికి నరకడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాంటప్పుడు ప్రజాధనంతో నాటుడు ఎందుకు అని అంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల దిగుబడి చేతికందింది. ప్రధానంగా మక్కల నూర్పిళ్లు చేసిన తరువాత వచ్చిన వ్యర్థాలను రోడ్డు పక్కనే నిప్పు పెడుతున్నారు. దీంతో చెట్లు కూడ తగులబడిపోతున్నాయి. దీంతో చెట్లకే కాదు తారు కూడ తొలగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పంట వ్యర్థాలను రైతులు ఎరువులుగా తయారు చేసుకునే అవకాశం ఉంది. కానీ సులభమైన పనికి అలవాటు పడిన రైతులు నేరుగా రోడ్డు పక్కనే కుప్పలకు నిప్పు పెట్టి చెట్లను సైతం తగుల బెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను నరికివేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వృక్షాలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

ట్రాన్స్‌కో వాళ్లు నరికివేశారు

ట్రాన్స్‌కో వాళ్లు చెట్లకు విద్యుత్ తీగలు తగులుతున్నాయని నరికి వేశారు. చెట్లను అడుగు భాగం వరకు నరక వద్దని హెచ్చరించాం. ఎవరు చెట్లు నరికినా జరిమానాలు విధిస్తాం. చెట్లను అందరు కాపాడాలి.

– గౌతమి, పంచాయతీ కార్యదర్శి, నాగంపేట్

ఫొటో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి

ఆర్మూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 28నుంచి 29వరకు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే చిత్ర ప్రదర్శన (ఫొటో ఎగ్జిబిషన్)ను విజయవంతం చేయాలని సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మ నాయక్ పేర్కొన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, రంగోళి, ఛాయా చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాసరచన, రంగోలి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ''ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'' ఫోటో ఎగ్జిబిషన్‌లో అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. హర్యానా, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ ఆసక్తికరమైన అంశాలు, కళా రూపాలు, వంటకాలు, పండుగలు, స్మారక చిహ్నాలు, పర్యాటక ప్రదేశాలు, క్రీడలు మొదలైన వాటిని తెలియజేసేలా ఈ ఛాయా చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో ఉచితంగా వీక్షించేందుకు తెరిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో రంగోళిని పరిశీలిస్తున్న అధికారులు

నేడు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవం



బోధన్: పట్టణంలోని శక్కర్‌నగర్ కోదండ రామాలయంలో ఆదివారం త్యాగరాజస్వామి శత గళ దివ్య ఆరాధన ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాలనీకి చెందిన సంగీత విద్వాంసులు దివంగత ప్రతాప రామకృష్ణయ్య, అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం, వారి కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. త్యాగరాజ స్వామి వారి సంకీర్తనలు సమాజంలో భక్తిబావ వ్యాప్తికి దోహదపడుతాయని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. నిర్వాహకులు ఉదయ్ శ్రీ, దీప్తిశ్రీ, రాధ, కావ్యశ్రీ, గీతాలక్ష్మి, హేమలత, సత్యసాయిబాబా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎదుగుదలలేని పిల్లలను గుర్తించాలి

మాక్లూర్: ఎదుగుదల లేని పిల్లలను గుర్తించి తగిన పోషక ఆహారం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీలదేనని డిచ్‌పల్లి ప్రాజెక్టు సీడీపీవో స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలో శనివారం 'పర్యవేక్షణతో కూడిన అనుబంధం పోషక ఆహారం' అనే అంశంపై జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 0నుంచి 6 సంవత్సరాల ప్రతి చిన్నారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వారికి అందించాల్సిన పోషక ఆహార విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే వారికి అందించాల్సిన వైద్యంపై సంబందిత వైద్యులకు చెప్పాలన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది అర్విండ్, వెంకటేశ్వర్లు, మమత, వరలక్ష్మి, జోషన్ అభియాన్ కోఆర్డీనేటర్ రాంబాబు, రంజిత్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో స్వర్ణ

గాంధీపార్కు రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్‌జామ్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గాంధీ పార్కు వద్ద రైల్వేగేట్ శనివారం కొన్ని గంటలపాటు తీయకపోవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11గం.ల ప్రాంతంలో రాకాసీపేట్ రైల్వే స్టేషన్ నుంచి గూడ్స్ రైలు బయలుదేరగా రైల్వేసిబ్బంది గాంధీ పార్కు వద్ద రైల్వే గేట్ వేశారు. కానీ గూడ్స్ రైలు బ్రేక్ డౌన్ కావడంతో రైలును నిలిపి, కొద్దిసేపటికి వెనక్కి రప్పించారు. గేటు మూసిఉండటంతో బోధన్ నుంచి బాన్సువాడ వెళ్లే దారిలో, బాన్సువాడ నుంచి బోధన్‌కు వస్తున్న వాహనాలు భారీగా నిలిచిపోయి, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వేగేట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

సంక్షిప్తం

28నుంచి విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తపాలశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28నుంచి విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్మూర్ పోస్ట్‌మాస్టర్ కిషన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

29న వాహనాల వేలంపాట

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని ఎంవీఐ కార్యాలయంలో ఈనెల 29న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు వాహన తనిఖీ అధికారి గుర్రం వివేకానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రవాణశాఖ అధికారులు గతంలో సీజ్‌చేసిన పలు వాహనాలను నోటీసులు ఇచ్చినా ఎవరు రాకపోవడంతో వేలం నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఆసక్తి గల వారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

రైతుసంఘ నాయకుడు గంగారాం సంతాప సభ



రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో శనివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకుడు చింత గంగారాం సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘనాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాగన్న, పార్వతి రాజేశ్వర్, ఒడ్డెన్న, పెద్దులు, నసీర్, మన్నే సాబ్, పోశెట్టి, లక్ష్మన్న, హమీద్ సుదర్శన్, హైమద్ పాల్గొన్నారు.

ఘనంగా యెల్లో డే



బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం యెల్లో డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు యెల్లో రంగు దుస్తులను ధరించారు. అనంతరం యెల్లో రంగులో ఉండే అరటి పండ్లు, నిమ్మ పండ్లు, జామ పండ్లను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బాల్కొండ: మండలకేంద్రంలోని మోడల్ కళాశాల విద్యార్థిని అపర్ణ అండర్ –19 రాష్ట్ర స్థాయి బాలికల ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. నందిపేట్ మండల కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై ందన్నారు. ఈనెల 28నుంచి మహబుబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..



బాల్కొండ/మోర్తాడ్: ఏర్గట్ల, మెండోరా మండలాల్లోని పలు బాధిత కుటుంబాలను శనివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు కోటగిరి రామాగౌడ్, సోమ దేవారెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, భానుచందర్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



కమ్మర్‌పల్లి: మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన ఇబ్రహీంపట్నం భూమేశ్వర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి, ఇటీవల మృతిచెందాడు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పరామర్శించి, రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు ఇంద్రాల రాజు, కాలేరు శేఖర్, పేరం లింబాద్రి ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో శనివారం ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్నను ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు సన్మానించారు. డీఆర్‌డీఏ ఏపీడీ రవీంధర్, డీపీఎం నూకల శ్రీనివాస్, ఏపీఎం కుంట గంగాధర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ముగ్గురు బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నాయకులు గుడాల మోహన్, టక్కరి గంగాధర్, గట్టువుతల నర్సారెడ్డి, లింగేశ్వర్, రాజేందర్, శీను పాల్గొన్నారు.



గోమాతకు అంత్యక్రియలు



బోధన్‌రూరల్: మండలంలోని సంగం గ్రామంలో హనుమాన్ మందిర్ గోమాత (ఆవు) మృతి చెందడంతో శనివారం గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు, వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి పూజలు చేసి ఖననం చేశారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

ఆర్మూర్‌టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. కార్యాలయ విధుల గురించి ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ విద్యార్థులకు వివరించారు. అనంతరంఉపాధ్యాయులు పోలీసులను సత్కారించారు. ప్రిన్సిపాల్ మిరాజ్, ఉపాధ్యాయులు విజయ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నగరంలో ఈషా గ్రామోత్సవ్

- నవంబర్ 16, 17 తేదీల్లో క్రీడా పోటీలు

నిజామాబాద్‌నాగారం: సద్గురు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి సారిగా నిజామాబాద్‌లో అతి పెద్ద గ్రామ క్రీడోత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో నవంబర్ 16, 17 తేదీల్లో ప్రతి గ్రామ పంచాయతీ నుంచి పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ మొదటివారం లోపల క్రీడాకారులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వాలీబాల్ పోటీలకు 14ఏళ్ల పైబడిన వాళ్లు, త్రోబాల్ పోటీలకు 13ఏళ్ల పైబడినవారు అర్హులన్నారు. నిజామాబాద్ స్థాయిలో గెలిచిన మొదటి నాలుగు టీమ్ లకు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి రెండు టీంలు హైదరాబాద్‌లో జరగబోయే స్టేట్ లెవెల్ క్రీడోత్సవాలలో పాల్గొంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో గెలిచినవారు ఇషా ఫౌండేషన్లో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారన్నారు. ఫైనల్లో గెలిచిన వారికి రూ. 5లక్షలు అందజేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలన్నారు. క్రీడాకారులు ఇషా వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. వివరాలకు 96038 84290, 89859 02205ను సంప్రదించాలన్నారు.

కోటగిరి బంద్ విజయవంతం



కోటగిరిలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు



తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రుద్రూర్: హిందూ ఆలయాలపై దాడులను నిరసిస్తూ హిందూ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం కోటగిరి మండల కేంద్రంలో బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి ఉంచారు. హిందూ ఆలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ కోటగిరిలోని రహదారిపై బైఠాయించి హిందూ సంఘాల సభ్యులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాలపై దాడులు, హిందూ దేవతల విగ్రహాల ధ్వంసం వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. దాడులపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి, కోనసముందర్‌లో రాజ్యసభ ఎంపీ నిధులతో చేపట్టే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంల నిర్మాణానికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కమ్మర్‌పల్లి సొసైటీ గోదాం నిర్మాణానికి రూ. 25 లక్షలు మంజూరు కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. నిధుల కోసం రాజ్యసభ ఎంపీ జోగు సంతోష్‌కుమార్‌కు విన్నవించగా, ఆయన స్పందించి కమ్మర్‌పల్లి, కోన సముందర్‌కు రూ. 10లక్షల చొప్పున రూ. 20లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. నిధులు కేటాయించినందుకు ఎంపీ సంతోష్‌కుమార్‌కు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవేందర్, బాపురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు స్వామి, రాజాగౌడ్, చిన్నారెడ్డి, సుధాకర్, బద్రి తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో సొసైటీ గిడ్డంగి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నూతన కార్యవర్గం ఎన్నిక

రెంజల్(బోధన్): మండల కేంద్రంలో శనివారం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్ అలీ(సాటాపూర్), ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్(బాగేపల్లి), ఉపాధ్యక్షురాలిగా రజని(మౌలాలితండా), కోశాధికారిగా సాయిలు(నీలా), సంయుక్త కార్యదర్శులుగా షీబాషబ్బం(దండిగుట్ట), నవీణ్(కళ్యాపూర్), ప్రచార కార్యదర్శిగా కృష్ణ(కూనేపల్లి), గౌరవ సలహాదారులుగా రాజేశ్వర్‌రావ్(రెంజల్), రాజేశ్వర్‌గౌడ్(తాడ్‌బిలోలి), వెంకట రమణ(వీరన్నగుట్టతండా), సభ్యులుగా సలాం, రాణీ, సలహాదారులుగా రాజు, సునీల్‌యాదవ్, సాయిబాబా, భాస్కర్ ఎన్నికయ్యారు.

కమర్‌పల్లి వీహెచ్‌పీ కమిటీ..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి తుమ్మల కృష్ణ ఆధ్వర్యంలో విశ్వ హిందూ పరిషత్ కమ్మర్‌పల్లి ప్రఖండ కమిటీ నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా కమ్మర్‌పల్లికి చెందిన బోగ రామస్వామి నియమితులయ్యారు. కార్యదర్శిగా ఏనుగు గంగారెడ్డి, సహ కార్యదర్శిగా జక్కని శ్రీధర్ నియమితులయ్యారు. బజరంగ్‌దళ్ సంయోజక్ సబ్బని సంపత్‌కుమార్, కమ్మర్‌పల్లి మండల సంయోజక్‌గా ఎలాల రాహుల్, ధర్మ ప్రసాద ప్రముఖ్‌గా దయత్రి లక్ష్మీ నరసింహచారి, గోరక్ష ప్రముఖ్‌గా మద్దుల రాజేందర్, ప్రచార ప్రముఖ్ సామ నరేష్ నియమితులయ్యారు.



వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	నరుడు బ్రతుకు నటన-12.45,6.50 పొట్టేన్(తెలుగు)-3.40,9.45
స్క్రీన్-2 –	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (తెలుగు-3డీ)-11.15,1.50,4.25, 7.00,9.35
స్క్రీన్-3 –	జనక అయితే గనక(తెలుగు)-1.00 లగ్గం(తెలుగు)-4.00,10.20 వేట్టయన్(తెలుగు)-6.50
స్క్రీన్-4 –	దేవర(పార్ట్-1)--11.35 6.25 విశ్వం(తెలుగు)-3.10 జనక అయితే గనక(తెలుగు)-10.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫిషియన్)

స్క్రీన్-1	లగ్గం(తెలుగు)-10.40,4.40 విశ్వం(తెలుగు)-1.30 7.30 వేట్టయన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	వెనమ్-ది (తెలుగు-3డీ)-11.00, 1.45,7.35 వెనమ్-ది(ఇంగ్లీష్-3డీ)-4.35, 10.35
స్క్రీన్-3	వేట్టయన్ - 1.35 పొట్టేన్(తెలుగు)-4.40,10.40 దేవర-పార్ట్-1(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ తెలుగు)-11.25,2.00 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ ఇంగ్లీష్)-4.35,7.10,9.45
స్క్రీన్-2	నరుడి బ్రతుకు నటన (తెలుగు)-1.05 దేవర(పార్ట్-1)- తెలుగు=4.00 జనక అయితే గనక(తెలుగు)-7.35 విశ్వం (తెలుగు)-10.35
స్క్రీన్-3	జనక అయితే గనక (తెలుగు)- 1.20 7.30 పొట్టేల్(తెలుగు)-4.20 10.25
స్క్రీన్-4	ఎంత పనిచేస్తావ్ చంంటి -11.00 లగ్గం(తెలుగు)-1.55 7.50 సముద్రుడు(తెలుగు)-4.45 వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	పొట్టేన్ (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వెనమ్ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	75,572	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800